# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 351 బుధవారం | 14 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## ఘనంగా తిరంగా ర్యాలీ

8లో




## బంగ్లాదేశ్‌లో అరాచకాలు

ఐక్యరాజ్యసమితి, మానవ హక్కుల సంఘం స్పందించాలి

బీజేపీ నేతల డిమాండ్

హిందూ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన

8 లో..



2లో..

## నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి

కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్



8లో..

## అందుబాటులోకి మానవ రహిత సబ్ స్టేషన్లు

ప్రారంభించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

మెరుగైన సేవలే లక్ష్యంగా అడుగులు



సర్వే చేసిన నిట్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్

పాల్గొన్న ఎండోమెంట్ అధికారులు, పూజారులు

గోవిందరాజుల గుట్ట అభివృద్ధికి అడుగులు

11వ శతాబ్దపు ఆలయంగా ప్రసిద్ధి

# గుట్టపైకి రోడ్డు మార్గం



వివరాలు 2లో..



నగర ప్రజలు కల సాకారం కాబోతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన గుట్టపైకి రోడ్డు మార్గం సుగమం కానుంది. కాకతీయ రాజుల కాలం నుంచి నగరానికి కేంద్ర బిందువుగా వెలుగొందిన గోవిందరాజుల గుట్టకు పూర్వ వైభవం తెచ్చేందుకు అడుగులు పడుతున్నాయి. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని గోవిందరాజుల గుట్ట అభివృద్ధికి ఈ ప్రాంతానికే చెందిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శ్రీకారం చుట్టారు. ఆమె ఆదేశాల మేరకు బుధవారం స్థానిక నాయకులు, ఆలయ పూజారులతో కలిసి నిట్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్ సభ్యులు సర్వే నిర్వహించారు. దానికి సంబంధించి సలహాలు సూచనలు సేకరించారు. 11వ శతాబ్దం చాళుక్యుల పాలనలోనే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడి సోదరుడే గోవిందరాజస్వామిగా కొండపై స్వయంభుగా వెలిశాడని చరిత్ర చెబుతోంది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులనుంచి డిమాండ్ రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఆలయ అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# గుట్టపైకి రోడ్డు మార్గం



**సర్వే చేసిన నిట్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్**

**పాల్గొన్న ఎండోమెంట్ అధికారులు, పూజారులు**

**గోవిందరాజుల గుట్ట అభివృద్ధికి అడుగులు**

**దక్షిణ భారతదేశంలో రెండో ఆలయం**

**11వ శతాబ్దపు ఆలయంగా ప్రసిద్ధి**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని చారిత్రక శ్రీ భూదేవి, నీళాదేవి సమేత గోవిందరాజుల స్వామి గుట్ట అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఎంతో కాలంగా పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఈ ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో దిగివచ్చిన దేవాదాయ శాఖ గుట్టపైకి రహదారి సౌకర్యం కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. శత్రువుల రాకను కనిపెట్టేందుకు కాకతీయ రాజులు ఈ గుట్టను ఉపయోగించినట్లు ఆధారాలు చెబుతున్నాయి. గుట్టపైనుంచి చూస్తే 360 డిగ్రీల్లో పట్టణమంతా కనిపించడంతోపాటు చుట్టూ కొన్ని కిలో మీటర్ల పరిధిలో ప్రజల కదలికలను కూడా కాకతీయ రాజులు ఇక్కడినుంచే గుర్తించేవారని ప్రచారంలో ఉంది. 11వ శతాబ్దం చాళుక్యుల పాలనలోనే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడి సోదరుడే ఈ గోవిందరాజస్వామిగా భక్తులు భావిస్తుంటారు. స్వామి కొండపై స్వయంభుగా వెలిశాడని చరిత్ర చెబుతోంది. ఇంతటి ప్రాశస్తం కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాంతానికే చెందిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నడుం భిగించారు. ఆమె సూచనలతో బుధవారం స్థానిక నాయకులు, ఆలయ పూజారులతో కలిసి నిట్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్ సభ్యులు సర్వే నిర్వహించారు. దీంతో గోవిందరాజుల స్వామి ఆలయానికి తిరిగి పూర్వ వైభవం వస్తుందని స్థానికులు భావిస్తున్నారు.

## నిట్ ఆధ్వర్యంలో సర్వే..

గోవిందరాజుల గుట్టపైకి రహదారి మార్గం నిర్మించేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో దేవాదాయ శాఖ ఏఈ దుర్గా ప్రసాద్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ నిర్వాహకులు విశ్రాంత ఆచార్యులు పాండు రంగారావు సూచనలతో నిట్ ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్ మెంట్ హెచ్ ఓడీ ఆచార్యులు సీఎస్ఆర్ఎస్ ప్రసాద్ బృందం బుధవారం ఆలయాన్ని సందర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకర్, దేవాలయ కార్యనిర్వహనాధికారి రత్నకర్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర ప్రతినిధి మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ జారతీ రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి, అర్చకులు లక్ష్మణ స్వామి, ప్రసాద స్వామి, మురళీ స్వామి, అరుణ్ స్వామి, జగన్నాథం, వెంకటేశ్వర స్వామి, కృష్ణస్వామి, స్థానిక నాయకులు ఈ సర్వేలో పాల్గొన్నారు. రోడ్డు మార్గానికి సంబంధించి సలహాలు, సూచనలు సేకరించారు.

## చారిత్రక ప్రదేశం..

గోవిందరాజుల గుట్ట ఒక చారిత్రక ప్రదేశం. ఓరుగల్లును పాలించినటువంటి కాకతీయ రాజులు శివాలయాలను నిర్మించక ముందే ఈ ఆలయం ఓరుగల్లులో ఉంది. ఈ గుట్టపై కొలువై ఉన్న ఆ గోవిందరాజస్వామికి వందల ఏళ్ల నాటి చరిత్ర ఉంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడికి ఈ గోవిందరాజస్వామి స్వయాన సోదరుడిగా భక్తులు భావిస్తుంటారు. గోవిందరాజస్వామి స్వయంభుగా ఈ కొండపై వెలిశాడని చరిత్ర చెబుతోంది. అయితే 11వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వివాహానికి కుబేరుడు ధన సహాయం చేసినట్లు స్థల పురాణం చెబుతుంది. కుబేరుడు ఇచ్చిన ధనాన్ని కొలిచే పనిని గోవిందరాజ స్వామి చేపట్టారు. ఎంతసేపు కొలిచినా పని పూర్తికాక పోవడంతో అలసిపోయి ఆ కొలమానికను తల కింద పెట్టుకొని సేదతీరినట్లుగా కథనాలున్నాయి.

## దక్షిణ భారతదేశంలో రెండో ఆలయం..

11వ శతాబ్దం చాళుక్యుల పాలనలో ఓ రాజు కలలో గోవిందరాజ స్వామి ప్రత్యక్షమై ఈ కొండపై వెలిశానని చెబుతారు. దీంతో ఆ చాళక్య రాజులు స్వామి వారికి ఆలయాన్ని నిర్మించారు. గుట్టపై శయన భంగిమలో ఉన్న గోవిందరాజస్వామితో పాటు ఆదిశేషుడు, నారదుడు, శ్రీదేవి, భూదేవి, నీలాదేవి కూడా కనిపిస్తారు. అయితే స్వయంభుగా వెలసిన శ్రీ గోవిందరాజ స్వామి ఆలయాలు దక్షిణ భారతదేశంలో రెండే ఉన్నాయి. అందులో ఒకటి తిరుపతి, మరొకటి వరంగల్ లో ఉంది. గోవిందరాజ స్వామి వారిని జైనులు తమ ఆరాధ్య దైవంగా భావించేవారు.

## నిత్య పూజలు..

ఏడాది పొడవున జరిగే పూజలతో ఈ ఆలయం నిత్యం కళకళలాడుతోంది. అయితే స్వామివారికి నిత్యం ఉదయం పాల భోగం, మధ్యాహ్నం మహా నైవేద్యం, సాయంత్రం మహారాధన నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మాసంలో బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా భక్తుల సమక్షంలో నిర్వహిస్తున్నారు. నిత్యం ఎంతో మంది వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంతానం లేని దంపతులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. సంతానం ప్రసాదించే స్వామిగా ఈ స్వామివారు పూజలు అందుకుంటున్నారు.

## పాలకుల నిర్లక్ష్యం..

వరంగల్ రైల్వేస్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న ఒక ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం, పుణ్యక్షేత్రం గోవిందరాజుల గుట్ట. ఈ గుట్ట ఎగువన గోవిందరాజుల స్వామి ఉంటే, దిగువన హనుమంతుడి ఆలయం ఉండటం విశేషం. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆలయానికి ఉన్న భూములు అన్యాక్రాంతమయ్యాయి. వాటిని కాపాడాలన్న భక్తుల కోరిక నెరవేరలేదు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో గుట్టపైకి రోడ్డు మార్గంతో పాటు భజన మందిరం, సాలగ్రామం, గుట్టపై వ్యూ పాయింట్, గార్డెన్ పనులను చేపట్టాలంటూ అభివృద్ధి కమిటీ సభ్యులను ఆదేశించినా అడుగు ముందుకు పడలేదు. గతంలో ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాల అవసరాలకు కేటాయించిన 5.25 ఎకరాల భూమితో పాటు గోశాల కోసం ఇచ్చిన 25 గుంటల భూమికి సంబంధించి సర్వే చేపడుతామంటూ అప్పటి కలెక్టర్ గోపి హామీ ఇచ్చినా కార్యరూపం దాలచలేదు. గోవిందరాజుల స్వామి గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని, ఆలయ భూముల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేయిస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన ఇచ్చిన హామీని తర్వాత వచ్చి కలెక్టర్లు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఆలయ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా దర్శనమిస్తోంది.





# నాణ్యమైన వైద్యసేవలను అందించాలి

**వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులలో తిరుగుతూ పరిస్థితులను పరిశీలించి అందిస్తున్న సేవలను నేరుగా రోగులను అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని వైద్యులకు సూచించారు. అదే విధంగా ఓపీ విభాగంలో కూర్చునేందుకు కొత్త ఫర్నీచర్ తెప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట తహసీల్దార్ విజయ సాగర్, డాక్టర్ చందు నాయక్, డాక్టర్ రాజు, డాక్టర్ శివశంకర్, డాక్టర్ భరత్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఫ్లోరేన్స్, ఫార్మసిస్ట్ విమల, ఐసీటీసీ కౌన్సిలర్ అశోక్ కుమార్, పారా మెడికల్ సిబ్బంది సురేష్, కిషోర్, అనిత, రజని, ఆసుపత్రి సిబ్బంది ప్రణీత్, శ్రీపాల్ రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## కాటమయ్య రక్షక కవచం శిక్షణ..

వరంగల్ జిల్లా ఉర్సు కరీమాబాదులో గీత కార్మికులకు తెలంగాణ కల్లుగీత కార్మికుల ఆర్థిక సంఘం హైదరాబాదు వారి సహకారంతో కాటమయ్య రక్షక కవచంపై నిర్వహించిన శిక్షణ, పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొని వారిని వివిధ విషయాలపై అవగాహన కల్పించారు.

# నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాళోజీ కళాక్షేత్రం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను కలెక్టర్ జీడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు జరుగుతున్న కాళోజి కళాక్షేత్రంలోని పెయింటింగ్స్, టైల్స్, ఎలక్ట్రికల్, ప్లంబర్, ఫ్యాబ్రికేషన్, లాన్ తదితర పనులను కలెక్టర్ పరిశీలించి వాటికి సంబంధించిన పనుల పురోగతి వివరాలను అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని, కూలీల సంఖ్యను పెంచి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ భీమ్రావు, కుడా పీఓ అజిత్ రెడ్డి సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 22న చలో హైదరాబాద్

## కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి
## సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నేత చంద్రన్న



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రన్న, గడ్డం సదానందం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఖిలా వరంగల్ పడమరకోట చమాన్ లోని అమరవీరుల స్తూపం వద్ద సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 22న చలో హైదరాబాద్" కార్యక్రమం "వాల్ పోస్టర్స్" ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రన్న, గడ్డం సదానందంలు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదప్రజలకు 10 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ దూరమయ్యారని, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నేటికీ ఉండడానికి సరైన ఇండ్ల స్థలాలు లేక, పక్క గృహాలు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేక అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, హామీల అమలుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూనుకోవాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్ల నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలిచ్చి, సాగు హక్కులనూ కల్పించాలన్నారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 22న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని, ఈ సందర్భంగా హైదరాబాదులో వేలాది మందితో ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, జిల్లా నాయకులు మైదం పాణి, డివిజన్ సహాయ కార్య దర్శి అర్షం అశోక్, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, జిల్లా నాయకులు వంశీ పాల్గొన్నారు.

## యువత స్వయం శక్తితో ఎదగాలి

### కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్



**వరంగల్ వాయిస్, ములుగు :** యువత స్వయం శక్తి తో అభివృద్ధి చెందాలని కాంగ్రెస్ ములుగు జిల్లా సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ అన్నారు. ములుగు మండలం అబ్బాపూర్ గ్రామంలో తోట దేవేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ ఎలక్ట్రికల్ షాప్ ను బాదం ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు జరిగిన పూజా కార్యక్రమంలో షాప్ యజమాని కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాదం ప్రవీణ్ మాట్లాడారు. గ్రామాల్లోని యువత తోట దేవేందర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నిరుద్యోగులు ఉద్యోగం లేదని బాధపడకుండా స్వతహాగా ముందకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లె జయపాల్ రెడ్డి,గండి కుమార్, రమేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మెష్‌తో జీఐ పైపుల బిగింపు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 57వ డివిజన్ పరిధిలో నెల క్రితం ఒక వ్యక్తి రాత్రి సమయంలో ఓపెన్ ఛానల్‌లో పడిపోయాడు. సంఘటనను చూసిన 57వ డివిజన్ కార్పొరేటర్ నల్లా స్వరూపారాణి-సుధాకర్ రెడ్డి తక్షణమే చర్యలు తీసుకుని గోపాల్ పురం ట్యాంక్ నుంచి సమ్మయ్య నగర్ వరకు ఫార్మసీ కళాశాల నుంచి ఇంజినీర్స్ కాలనీ వరకు మెష్‌తో జీఐ పైపులు బిగించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వరరావు అన్నారు. సిరి స్వచ్ఛంద సంస్థ అయోధ్య పురంలో మహిళలకు మూడు నెలలపాటు నిర్వహించిన కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రికార్డ్ సర్వీసెస్ సొసైటీ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్ మాట్లాడుతూ నగరంలో అనేక చోట్ల ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, ముందు ముందు అనేక అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త, స్వచ్ఛంద సంస్థల సలహాదారుడు నిమ్మల శ్రీనివాస్, మడికొండ, కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రభాకర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి సీఐ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా బి.రాజగోపాల్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ శ్రీనివాస్ సస్పెండ్ కావడంతో అతడి స్థానంలో రాజగోపాల్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో పాత ఖమ్మం జిల్లా కొత్తగూడెం, చర్ల, బయ్యారం, ఇల్లందు తదితర ప్రాంతాల్లో పనిచేసి, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

## స్వతంత్ర భారతంలో స్వాతంత్ర్య ఫలాల జాడలేవి?



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డైబ్బే ఏళ్ల స్వతంత్ర భారతంలో స్వాతంత్ర్య ఫలాలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా నేటి పౌరులంతా జాతీయభావం స్పూర్తితో ప్రయోగాత్మకంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మన జాతీయ సంపదనంతా ముఖ్యంగా అట్టడుగు స్థాయిలో ఉన్న పేద, బడుగు వర్గాలకు చేరే విధంగా కృషి చేయాల్సిన చారిత్రక అవసరముందని పరాంకుశం రఘు నారాయణ అన్నారు. ఆ దిశగా సామాజికవేత్తలంతా ఓ ఉద్యమంగా కదిలి అందరికీ చదువు, అందరికీ ఆరోగ్యం, కడుపునిండా తిండి, ప్రతి కుటుంబానికి గూడు, ప్రతి చేతికి పని, వారి వారి అవసరాలు తీర్చటమంటే? ఆకలి, దప్పికలేని కొంగొత్త సమాజాన్ని సృష్టించే కోణంలో మరికొన్ని ప్రణాళికా రచనలు చేయాల్సిన ఆగత్యం ఉందన్నది మరువరాదు. పరిపాలకుల్లో ఉన్న అవినీతి నియంత్రణాచట్టం మరింత బలపడాలి. ప్రతివారికి ముఖ్యంగా దిగువ, మధ్య తరగతి వర్గాలకు న్యాయం శీఘ్రగతిన అందాలి. కాలయాపనను నివారించాలి.ఆర్తుల ఆర్తనాదాలకు ముగింపు పలకాలి. పూరి గుడిసెల,మురికికొంపల బతుకుల్లో వెలుగులు నిండాలి. ఉచితంగా పంపిణీ చేసే సాదా సీదా సంక్షేమ పథకాలు నిలిపివేయాలి, ఆదిశగా ఆర్థిక స్వయం ప్రతిపత్తిని పెంచాలి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇంకా పురోగతి సాధించాలి, పారిశ్రామిక రంగం, వ్యవసాయ రంగం మరింత వృద్ధి చెందాలని పరాంకుశం రఘు నారాయణ అన్నారు. అప్పుడే మనం కలలుగన్నట్లుగా, సుభిక్షమైన నవభారత నిర్మాణానికి పునాదులు పడినట్లుగా భావిద్దామని తెలిపారు. మనం ఆశించిన రీతిలో స్వాతంత్ర్యం సిద్ధించినట్లైందన్న మన చిరకాలవాంఛ సాకారమైందని ఆకాంక్షిద్దాం! ఆ కోణంలో మరో ఉద్యమానికి మద్దతిద్దామన్నారు.

## జర్నలిస్ట్ యోగి చిత్రపటానికి నాయిని నివాళి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల మరణించిన పాత్రికేయుడు గొట్టేముక్కల యుగేందర్ రెడ్డి అలియాస్ యోగి, ఆయన కుమార్తె ఆద్యరెడ్డిల చిత్రపటానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో పూలమాల వేసి నివాళి అర్పించారు. యోగి మరణం తనను చాలా బాధించిందన్నారు. యోగిరెడ్డి, ఆద్యరెడ్డిల ఆత్మలకు శాంతి చేకూరాలంటూ జర్నలిస్టులతో కలసి 2 నిమిషాలు మౌనం పాటించారు. యోగి కుటుంబ సభ్యులకు తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, బోడిగె శ్రీను, దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, ఈసీ మెంబర్లు హరీష్, అంజి, శ్రీకాంత్, దిలీప్, ఎండీ నయీం, రాజు, వేణుగోపాల్, సంజీవయ్య, యూనియన్ నేతలు గాడిపెల్లి మధు, బీఆర్ లెనిన్, గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, సోమనర్సయ్య, రాజేంద్రప్రసాద్, అంతడుపుల శ్రీనివాస్, జన్ను స్వామి, చినబాబు, మోయిన్, సునీల్, రామరాజు, రమేశ్, మున్నా, శ్రీధర్, యుగంధర్, కార్పోరేటర్ తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** జీడబ్ల్యూఎంసీ 16వ డివిజన్ పరిధిలోని ధర్మారం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో బుధవారం దాత ప్రొఫెసర్ గాదె దయాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని, వాటిని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలన్నారు. విద్యార్థులు తమకు ఎంతటి కష్టం ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. అనుకున్నది సాధించేంత వరకు విశ్రమించకూడదని సూచించారు. భవిష్యత్ లో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థిని షాఫిక సమ్రిన్ చేసిన భారత నాట్య నృత్యాన్ని చూసి అభినందించి బహుమతిని అందజేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలు తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఉపాధ్యాయుల శిక్షణలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అంకితభావంతో చదివి పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని, పాఠశాలకు అవసరమైన గ్రౌండ్ ఏర్పాటుకు కూడా సంబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడి వెంటనే మంజూరు చేస్తానని తెలిపారు. ధర్మారంలోని ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ సెంటర్ ను పరకాల శాసనసభ్యుడు రేవూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

# విప్లవోద్యమానికి మల్లికాంబ సేవలు మరువలేనివి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు మాతృమూర్తి సంతాప సభ బుధవారం ఖిలా వరంగల్ పడమరకోటలో జరిగింది. ఈ సంతాప సభకు న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించారు. ఈ సభలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ 1977 సంవత్సరంలో ఎమర్జెన్సీ వేసిన తర్వాత అటవీ, గ్రామాల విప్లవోద్యమ నిర్మాణమే కాక, పట్టణ ప్రాంతాల్లో కూడా విప్లవ ప్రజా సంఘాల నిర్మాణం చేపట్టాలని నాటి చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలోని విప్లవ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు వరంగల్ నగరంలో ప్రజా సంఘాల నిర్మాణం చేశారని, అందులో విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్ యూలో బండి కోటేశ్వరరావు పనిచేశారని వారు తెలిపారు. కోటేశ్వరరావు తల్లి బండి మల్లికాంబ తన నలుగురు కొడుకులు విప్లవ ప్రజా సంఘాలలో పనిచేస్తున్న క్రమంలో ఆమె కూడా పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని ధైర్యంతో వారికి సహకరించారని వక్తలు పేర్కొన్నారు. కొడుకులను పోలీసులు అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపితే విడుదలైన తర్వాత ఎదురు వెళ్లి స్వాగతం పలికారని వారు గుర్తు చేశారు. అమ్మ మల్లికాంబ సేవలు ఆదర్శంగా తీసుకోవాలని వారు తెలిపారు. సభలో మాట్లాడిన వారిలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు చిన్న చంద్రన్న, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు రంజిత్, సీపీఐఎంఎల్ నాయకులు బైరబోయిన ఐలయ్య, ఏపీటీఎఫ్ నాయకులు గుర్రాల వెంకటేశ్వర్లు, ప్రముఖ అభ్యుదయ కవి, గాయకులు యోచన కొల్లూరి యోగానంద్, నలిగంటి చంద్రమౌళి, ప్రజా సంఘాల నాయకులతో పాటు నాటి ఉద్యమ సహచరులు కార్యకర్తలు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు అమ్మ మల్లికాంబ చిత్రపటానికి చిన్న చంద్రన్న పూలమాల వేయగా హాజరైన వారు అమ్మను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# జాతీయ జెండాల పంపిణీ



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్ మొగిలిచెర్ల, పోతరాజు పల్లి, గొర్రె కుంట, రెడ్డిపాలెంలో జాతీయ జెండాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ విచ్చేసి మాట్లాడారు. జాతీయభావంతో ప్రజలు, కార్యకర్తలు విధిగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాలు ఎగురవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల ప్రభాకర్, డివిజన్ నాయకులు నరిసెట్టి చంద్రమౌళి, లెంకలపల్లి స్వామి, అవినాష్, రమేష్, సోషల్ మీడియా ఇంచార్జి నమతా బాజీ రామకృష్ణ, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జిలు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ యువ మోర్చా నియోజకవర్గ కన్వీనర్‌గా చెంగల సురేష్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** బీజేపీ యువమోర్చా వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ గా చెంగల సురేష్ నియామకమ్యారు. సురేష్ 10 సంవత్సరాలు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘంలో పనిచేశారు. హిందూ జాతీయతా భావాలు కలిగిన కట్రియాల గ్రామానికి చెందిన చెంగల సురేష్ ను భారతీయ జనతా యువమోర్చా వర్ధన్నపేట మండల అధ్యక్షుడిగా, శక్తి కేంద్ర ఇంచార్జిగా పని చేసిన విధానాన్ని గుర్తించి మరికొన్ని సేవలు వినియోగించుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ వీరు వర్ధన్నపేట బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ గా నియమించడం జరిగింది. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ఓబీసీ నాయకులు జడ సతీష్, జిల్లా బీజేపీ నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి, మాజీ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నూనె అనిల్, రాష్ట్ర బీజేవైఎం కోఆర్డినేటర్ శ్రావణ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాపాక ప్రశాంత్ లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఓబీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

## వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఐఎల్ పీఏ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామాజికన్యాయ పోరాటంలో బహుజన న్యాయవాదులను భాగస్వాములను చేయడం కోసం ఈ నెల 25న హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బీసీ న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలని ఐఎల్ పీఏ రాష్ట్ర నాయకులు పొన్నం దేవారాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని వరంగల్ బార్ అసోసియేషన్ లో వరంగల్ బార్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం ఎవరికి దక్కాల్సిన వాటా వారికి దక్కాలని, స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు దాటినా, స్వేచ్ఛ, సమానత్వం కోసం రాజ్యాంగం వ్రాసుకున్నా 90 శాతం ప్రజలకు ఇంకా న్యాయం జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, మాజీ అధ్యక్షుడు అంబరీష్ రావు, తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, చిల్లా రాజేంద్రప్రసాద్, ఆనంద్ మోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్ధన్ మాట్లాడుతూ సామాజిక న్యాయ సమరంలో రాజ్యాంగం, చట్టం తెలిసిన న్యాయవాదులు ముందుండాలన్నారు. బీసీ సమాజం ఐక్యతగా సాగి చట్టసభల్లో, న్యాయ వ్యవస్థలో వారి వాటా వారు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25న హైదరాబాద్ లో జరిగే బీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సుకు న్యాయవాదులు హాజరై వియవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐఎల్ పీఏ రాష్ట్ర నాయకులు మాధవ కృష్ణ, సాయిని నరేందర్, నరహరి, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పగడాల సుదర్శన్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లడే రమేష్, మాజీ ప్రధాన కార్యదర్శి గునిగంటి శ్రీనివాస్, న్యాయవాదులు పులి సత్యనారాయణ, ఆంజనేయులు గౌడ్, దయాల సుధాకర్, కోటేశ్వరరావు, బొమ్మ నాగరాజు, యుగేందర్, రాయబారపు భిక్షపతి, అనిల్, వినయ్, సుందర్ రామ్, రామనాథం, జిలకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



**వరంగల్ వాయిస్, రేగొండ :** రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వారి అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తుందని భూపాలపల్లి నియోజవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. రేగొండ మండలంలోని ఎస్ఎస్ అగ్రిమాల్ చైర్మన్ సిరికొండ తిరుపతి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని, తెలంగాణ రాష్ట్ర రైతు సోదరులకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం రైతులకు ఉచిత మందుల పంపిణీ గుర్తింపు కార్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి మాజీ జడ్పీ జిల్లా చైర్మన్ సాంబారి సమ్మయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, బీఆర్ఎస్ నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, తహసీల్దార్ శ్వేత రావు, సత్తన్న యవసేన నాయకులు, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన సీఐ రాఘవేంద్రరావు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఏనుమాముల పోలీస్ స్టేషన్ కు నూతనంగా నియమితులైన రాఘవేంద్రరావు ఏనుమాముల పోలీస్ స్టేషన్ లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ బదిలీ కావడంతో ఏ రాఘవేంద్ర ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా సీఐని స్థానిక ఎస్సై పోగుల శ్రీకాంత్, సిబ్బంది స్వాగతం పలికారు.

# భాగ్యలక్ష్మికి సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ లో హెచ్ వీ ఏం.భాగ్యలక్ష్మి రెగ్యులర్ బదీలల్లో భాగంగా రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయిన సందర్భంగా బుధవారం ఎఫ్ డబ్ల్యూసీ స్టాఫ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మెరుగు యశస్విని, హెల్త్ సూపర్ వైజర్ నర్సమ్మ, స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి, ఈసీ ఏఎన్ఎం మేరీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ జిల్లా భూపాలపల్లి మహాదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన తూడిచెర్ల పెద్ద లస్మయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. బుధవారం వారి కుటుంబాన్ని మండల జర్నలిస్టులు కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సీనియర్ జర్నలిస్టు ప్రవీణ్, నేటి ధాత్రి పత్రిక విలేకరి మిన్ను బాయ్, జనం సాక్షి రిపోర్టర్ రాజిరెడ్డి, మెట్రో దేవేందర్, తెలుగు ప్రభ మోతే సాంబయ్య, సీనియర్ జర్నలిస్టు సాటేపూరి అనిల్, 4 సైడ్ టీవీ న్యూస్ సంత్ పంచతంత్ర రాజు, నిజం న్యూస్ దేవుళ్లపల్లి కృష్ణ ఉన్నారు.

# విద్యార్థులకు స్కూల్ షూల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం స్కూల్ షూలను పంపిణీ చేశారు. నేడు బీఎస్ ఎన్ఎల్ నుంచి పదవీ విరమణ పొందిన యశోదా దేవి, వారి కుమారుడైన రవి కిషోర్ రాయుడు (తల్లి, కుమారులు) ఏవీవీ పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.15,000ల విలువ చేసే స్కూల్ షూలను వితరణ చేశారు. ప్రిన్సిపాల్ డా.ఎ.భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ దాతల దాతృత్వానికి కృతజ్ఞతలను తెలియపరుస్తూ తాను దానం చేస్తూ తనతో పాటు ఈ నాటి దాతలను కూడా దాతృత్వం వైపు తీసుకొచ్చి, ఈ నాటి కార్యక్రమ నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించిన నాళ్ల సోమనాథంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తదనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల అకాడమిక్ సలహాదారులు వాసుదేవులు, ఉపాధ్యాయ బృందం ఎ.సంధ్యారాణి, ఎన్.నవీన్, యం.వాసంతి, జి.భాగ్యలక్ష్మి, వి.రమాదేవి, జి.వీరేశలింగం, ఫిలిప్ లాజరస్, చిలుక భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ప్రభుత్వఆస్పత్రిలో డెంగీ, మలేరియా, విషాహారానికి సంబంధించి అత్యవసరమైన మందులను స్టాక్ ఉంచుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పరకాలలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో వార్డులలో ఉన్న పేషెంట్స్ తో ముఖాముఖిగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసరమైన మందులను తగినన్ని అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి మలేరియా, డెంగీ జ్వరాలకు సంబంధించిన కిట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు జ్వరాలకు ఇక్కడే రాపిడ్ టెస్టులు నిర్వహించి వైద్యం చేయడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని అన్ని రిజిస్టర్లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్లేట్ లెట్ కౌంట్ ను తెలుసుకోవడానికి ఉపయోగించే యంత్రాన్ని ఏదైనా పీహెచ్ సీ నుంచి తెప్పించి ఇక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డీఓ నారాయణ,ఆసుపత్రి సూపరిడెంట్ గౌతమ్ చౌహాన్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్‌తో మానసిక, శారీరక దృఢత్వం

### యువతకు రూ.1947 కే ఏడాది పాటు శిక్షణ

### కోచ్ గడదాసు మణికంఠ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరంలోని కొత్తవాడలోని న్యూ రైసింగ్ సన్ పాఠశాలలో మణి మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్నెస్ అకాడమీ కోచ్ గడదాసు మణికంఠ యువతీ యువకులకు కేవలం రూ.1947 లకు సంవత్సరం పాటు మార్షల్ ఆర్ట్స్, ఫిట్ నెస్ కోచింగ్ ఇవ్వబడునని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత రోజుల్లో యువత వ్యసనాలకు అలవాటు పడి వ్యాయాయం చేయడం లేదని, దీంతో అధిక బరువు, బద్ధకంగా, మానసికంగా ఒత్తిడికి గురవడం జరుగుతుందని మణికంఠ పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. యువతలో మార్పు తీసుకురావాలని ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు, వీరితో పాటు ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యలు కచ్చితంగా నేర్చుకోవాలని మణికంఠ సూచించారు.

## సాక్షులను బెదిరించిన కేసులో ఒకరి అరెస్ట్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన మొగుళ్ల భద్రయ్యపై జరిగిన హత్యాయత్నం కేసులో ఉన్న సాక్షులను బెదిరించిన కేసులో అదే గ్రామానికి బొచ్చు సమ్మయ్యను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం పోలీస్ స్టేషన్ లో విలేకరులతో మాట్లాడారు. చట్టపరమైన కేసుల్లో భాగస్వామ్యమైన సాక్షులను బెదిరించిన, ప్రలోభాలకు గురిచేసిన చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు. వెంకటాపూర్ మండలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కావద్దని, అలా మరల జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరిగిన కఠిన చర్యలు తీసుకోకతప్పదని ఎస్ఐ సతీష్ హెచ్చరించారు.

## శామంతుల శ్రీనివాస్‌కు సత్కారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్ గా నియామకమైన న్యాయవాది పద్మశాలి ముద్దు బిడ్డ శామంతుల శ్రీనివాస్ ను పోపా నాయకులు శివనగర్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్, ప్రధాన కార్యదర్శి పాము శ్రీనివాస్, రాష్ట్ర పోపా నాయకులు గోషికొండ సుధాకర్, ధర్మపురి రాజగోవింద్, శ్రీధర్, మాటేటి సంతోష్, మెరుగు సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పద్మశాలి కులస్తులకు ఎటువంటి సమస్యలు ఉన్న అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

# బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడుకుందాం

## హనుమకొండ చౌరస్తాలో నిరసన దీక్ష




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బంగ్లాదేశ్ లో హిందువుల పై జరుగుతున్న దాడులను ఖండిస్తు బుధవారం నాడు హనుమకొండ చౌరస్తాలో హిందూ సంరక్షణ సమితి అధ్యక్షుడు బూర రాంచందర్ అధ్యక్షతన నిరసన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బంగ్లాదేశ్ లోని హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్క హిందు ఖండించాలన్నారు. మన పొరుగున ఉన్న దేశం బంగ్లాదేశ్ లో రిజర్వేషన్ల అంశంపై మొదలైన నిరసన అదుపుతప్పి హింసాకాండగా, మత విద్వేషంగా రూపు దాల్చి చివరికి హిందూ వ్యతిరేక మారణకాండగా మారింది. ఆ దేశ ప్రధాని రాజీనామా చేసినా ఈ అల్లర్లు తగ్గుముఖం పట్టడం లేదంటే, ఈ నిరసన వెనక మరొక కోణం దాగి ఉందన్న విషయం బయటపడుతుందని అన్నారు. ఏ హిందువులు 50 ఏళ్ల కిందట ప్రత్యేక బంగ్లాదేశ్ ఏర్పాటుకు అండగా నిలిచారో ఆ హిందువుల పైనే ఇప్పుడు బంగ్లాదేశ్ లో దారుణమైన అత్యాచారాలు, హింసాకాండ, మారణకాండ గత కొన్ని రోజులుగా జరుగుతుంది. మానవత్వపు ఛాయలు ఏమాత్రం లేని ఛాందసవాద ముస్లింలు హిందువుల ఆస్తులు, హిందు మందిరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటూ ఉగ్ర దాడులు చేస్తున్నారు. బంగ్లాదేశ్ ఇస్లామిక్ మత ఛాందసవాద శక్తుల ఈ ఘోర రాక్షస మూక దాడికి వేలాది మంది హిందూ స్త్రీలు అత్యాచారాలకు గురై, హిందువులు క్షతగాత్రులై, నిరాశ్రయులై, జీవచ్ఛవంగా మిగిలారని అన్నారు. వందలాది మంది హిందువులు శవాల కుప్పల అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ మొత్తం ఇప్పుడు ఇస్లామిక్ అల్లరిమూకల చేతుల్లోకి వెళ్లిపోయింది. నిరసనల నెపంతో వారు హిందువులను వెతికి, వెతికి మరీ దారుణంగా హత్యలు చేస్తున్నారని తెలియజేశారు. ఈ నిరసన సభలో హిందు సంఘాల నేతలు సుదీర్ ఆర్య, బుచ్చిబాబు, గందే కృష్ణ, అర్సేనపల్లి విద్యాసాగర్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్ బాబు, న్యాయవాదులు చామర్తి ప్రభాకర్, సహోదర్ రెడ్డి, సురేష్, వాణి, విశ్రాంత ఉద్యోగులు అల్లం మల్లికార్జునరావు, మల్లారెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ నిరసన సభలో బీజేపీ నాయకులు, వీహెచ్ పీ భజరంగ్ దళ్ నాయకులు, న్యాయవాదులు, హిందూ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# నష ముక్త్ భారత్ అభియాన్ అవగాహన సదస్సు

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాల ఆవరణలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వారి సంయుక్త ఆధ్వర్యంలో నష ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం, హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా ఇంటర్ విద్య అధికారి ఏ.గోపాల్, ఎన్.వైకే యూత్ ఆఫీసర్ సీహెచ్ అన్వేష్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ సురునేని శ్రీధర్, వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వసుధ హాజరై మాదకద్రవ్యాల వినియోగం, దాని దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. నష ముక్త్ భారత్ అభియాన్ ప్రాధాన్యతను వివరించారు. ఎంతో మంది యువత పార్టీల పేరిట, జల్సాల పేరిట, బ్రీజర్ నుంచి బీరుకు, బీరు నుంచి బ్రాండికి, బ్రాండి నుండి డ్రగ్స్ కు అలవాటు పడి, భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత శక్తి, యుక్తులు వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి, దేశానికి ఉపయోగపడే విధంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు జాతీయ జెండాలను చేబూని హర్ ఘర్ తిరంగా ర్యాలిని ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాల, హనుమకొండ నుంచి అశోక జంక్షన్ మీదుగా చేపట్టడం జరిగింది. ఈ ర్యాలీలో జాతీయ స్ఫూర్తిని రగిలించే నినాదాలతో ప్రాంగణమంతా హోరెత్తింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆర్.ప్రవీణ్ కుమార్, డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, నెహ్రూ యువ కేంద్ర సూపరెండెంట్ బానోత్ దేవిలాల్, రాజేష్, కళాశాల అధ్యాపక అద్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే ముస్లింల అభివృద్ధి

### డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** కాంగ్రెస్‌తోనే ముస్లింల అభివృద్ధి అని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ అన్నారు. బుధవారం మరిపెడ పట్టణంలోని హౌజింగ్ బోర్డు సీతారంపురంలోని మస్జిద్-ఎ-రహమానియా సదర్ కమిటీ ఆధ్వర్యంలో "ఆత్మీయుల ఐక్యత సమ్మేళనం" సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోర్నకల్ ఎమ్మెల్యే డా. రాంచంద్రు నాయక్ , ఎంబీటీ రాష్ట్ర అధ్యక్షుడు అంజాతుల్లా ఖాన్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో, రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పాటుపడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయేనన్నారు. గత ప్రభుత్వం ముస్లింలను మోసం చేసిందన్నారు. హౌజింగ్ బోర్డు మజీద్ నిర్మాణం కోసం తమ దృష్టికి వచ్చిదన్నారు. పరిశీలించి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ముస్లింల పలు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముస్లింలు రాజకీయ నేతలుగా ఎదగాలని ఎంబీటీ రాష్ట్ర అధ్యక్షుడు అంజాతుల్లా ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు రాజకీయాల్లో రాణించాలన్నారు. ముస్లింలకు ఎమ్మెల్యే లు,ఎమ్మెల్సీ లు ఎలాంటి పదవులు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్ర రెడ్డి,రా ష్ట్ర నాయకులు నూకల నరేష్ రెడ్డి, ఒంటి కొమ్ము యుగేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రఘువీరా రెడ్డి, టౌన్ అధ్యక్షుడు తాజుద్దీన్, అఫ్జల్, రాంలాల్, అంబరీష, బది ఉజ్జమా, సాదిక్, సాజిద్, సర్వర్, యాకూబ్ పాషా, ముస్లిం సోదరులు, సోదరీమణులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నియోజకవర్గంలో రెండు రోజుల్లో రెండు కోట్ల రూపాయల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం 96 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాది ముభారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రయాణించే ఆర్టీసీ బస్సులను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను రద్దీకి అనుగుణంగా కావలసిన రూట్ లలో పునరుద్ధరించి మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, రేగొండ :** కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలబడుతుందని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రజా పాలనతో లబ్ధి జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలంలో ఎమ్మెల్యే గండ్ర విస్తృతంగా పర్యటించారు. ముందుగా రేగొండ మండల కేంద్రంలోని పరకాల-భూపాలపల్లి ప్రధాన రహదారిపై ఉన్న ఎస్ఎస్ అగ్రిమాల్ చైర్మన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు ఆధ్వర్యంలో రైతు అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు కార్యాలయాన్ని ఎమ్మెల్యే ముందుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకకాలంలో రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. అనంతరం రైతులకు ఉచిత మందుల పంపిణీ, గుర్తింపు కార్డు, వివిధ పంటల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మండలంలోని సుప్రసిద్ధ కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే దర్శించుకున్నారు.అక్కడ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కాకర్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పున:ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాకర్లపల్లి ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి పొనగల్లు గ్రామం వరకు రూ.150 లక్షలతో బీటీ రోడ్డు రెన్యువల్ పనులకు కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జి.కిష్టయ్య, ఉమ్మడి జిల్లాల మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకుడు మోడం ఉమేష్ గౌడ్, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ జలపతిరావు, శాస్త్రవేత్త ఉమారెడ్డి, తహసీల్దార్ శ్వేత, పంచాయతీ ఎంపీఓ గడ్డం రాంప్రసాదరావు, గిర్దావరి జూపాక నరేష్ కుమార్, డైరెక్టర్లు ఏనుగు రవీందర్ రెడ్డి, బల్గూరి రాజేశ్వరరావు, లింగంపల్లి బాబురావు, లింగంపల్లి ప్రసాద్ రావు, రేగొండ మాజీ ఎంపీటీసీ మైస సుమలత భిక్షపతి, మాజీ ఎంపీటీసీ పట్టెం శంకర్, ఎన్ఎస్ఆర్ అధినేత నాయినేని సంపత్ రావు, రేగొండ మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి, రేగొండ గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి గౌడ్, జగ్గయ్యపేట మాజీ ఎంపీటీసీ దుగ్యాల సునీత రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్ పాతపెల్లి సంతోష్, ఉప సర్పంచ్ రాజు, కాంగ్రెస్ నాయకుడు మట్టికే సంతోష్, జడ్పీటీసీ పత్తి వినోద ప్రభాకర్, అమ్ముల సదానందం, అమ్ముల రాజయ్య, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, సుల్తాన్ పూర్ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు కానుగుల తిరుపతి, గోరి కొత్తపల్లి మాజీ సర్పంచ్ సూదనబోయిన ఓం ప్రకాష్, జిల్లా నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, యూత్ నాయకులు పున్నం ప్రవీణ్, ముదురుకోళ్ల తరుణ్, సత్తన్న యువసేన సురేందర్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుక ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం జరగబోయే 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎస్.ఆర్ కేకన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేపు జరిగే వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోత్ రామచంద్రనాయక్ హాజరై జాతీయ జెండా ఆవిష్కరణ చేసి ప్రసంగిస్తారన్నారు. వేడుకలకు వచ్చే స్వతంత్ర సమరయోధులు, పుర ప్రముఖులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, అతిధులకు ప్రోటోకాల్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని, గ్రౌండ్ లో సానిటేషన్, తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని రోడ్ల భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అభివృద్ధిపై ఫొటో ఎగ్జిబిషన్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చెన్నయ్య, మహబూబాబాద్ ఆర్డీఓ అలివేలు, జడ్పీ సీఈవో నర్మదా, మున్సిపల్ కమిషనర్ రవీందర్, డీఏఓ అభిమన్యుడు, డీహెచ్ఓ మరియన్న, స్థానిక తహసీల్దార్ భగవాన్ రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## జిల్లాకు ఆర్జేడీ ఆఫీసు రావడం సంతోషకరం



**వరంగల్ వాయిస్ హనుమకొండ :** గత రెండు సంవత్సరాల క్రితం హనుమకొండ నుంచి హైదరాబాదుకు తరలించినటువంటి ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయాన్ని తిరిగి హనుమకొండ లోనే పునరుద్ధరణ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం 269 ముఖ్య సలహాదారుడు వీరమల్ల బాబురావు, రాష్ట్ర అధ్యక్షుడు కీర్తి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబులు సీఎం రేవంత్ రెడ్డికి, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసే గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సిబ్బంది సర్వీస్ కు సంబంధించిన అన్ని రకాల సమస్యల పరిష్కారం కోసం గత రెండు సంవత్సరాలుగా హైదరాబాద్ చుట్టూ తిరగలేక చాలా ఇబ్బందులు పడ్డామని వాపోయారు. తాము పడుతున్న ఇబ్బందుల గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, తమ కోరికను మన్నించి, వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు హైదరాబాదు నుంచి ఆర్జేడీ కార్యాలయాన్ని హనుమకొండలోనే పునరుద్ధరణ చేసినందుకు రుణపడి ఉంటామని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం 269 తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

## బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** మండలంలోని మచ్చాపూర్, గంగదేవిపల్లి గ్రామాలలో ఇటీవల మృతిచెందిన కంబాల శ్రీనివాస్, మామిండ్ల లక్ష్మీ కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కక్కర్ల అనుదీప్, అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్ఎంపీ డాక్టర్ రఫీలను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వైద్యురాలి అత్యాచార ఘటనపై నిరసన




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వైద్యురాలిపై అత్యాచార ఘటనపై నిరసిస్తూ జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల విద్యార్థులు, జూనియర్ వైద్యులు ప్ల కార్డులు ప్రదర్శించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ మధు మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల లో వైద్యులకు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. వైద్యురాలిపై జరిగిన అత్యాచార దాడి హేయమైన చర్యని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, జూనియర్ డాక్టర్ మధు పాల్గొన్నారు.

# అనుమతి ఒకచోట.. తరగతులు మరోచోట

## ఆల్ఫోర్స్ జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ నిబంధనలకు పాటించకుండా ఒకే గుర్తింపుతో బ్రాంచ్ లను నడిపిస్తున్న ఆల్ఫోర్స్ ప్రైవేటు జూనియర్ కాలేజిపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయ కార్యదర్శి ఓ.చిరంజీవి హనుమకొండ జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి గోపాల్ కు వినతిపత్రం అందజేశారు. ఆల్ఫోర్స్ జూనియర్ కాలేజీపై వేసవి నుంచి ఫిర్యాదు చేస్తున్న డీఐఈఓ పట్టించుకోకుండా, వారికి వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారని, అందుకే రెచ్చిపోతున్నారని, వేసవిలో తరగతులు నిర్వహిస్తుంటే కనీసం పర్యవేక్షణ చేయలేదని, ప్రస్తుతం దాని గుర్తింపు భీమారం బొడ్రాయి దగ్గర అయితే అక్కడ కనీసం కాలేజి బోర్డు కూడా లేదని, మరొకచోట తరగతులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి గుర్తింపు లేకుండానే కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో అకాడమీ పేరుతో ఇంటర్ క్లాసులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం నుంచి కో-ఎడ్యుకేషన్ కోసం అనుమతి తీసుకొని విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా తరగతులు నిర్వహించడం, హాస్టల్స్ కు అనుమతులు లేకున్నా హాస్టల్స్ నడిపించడం, స్టడీ మెటీరియల్ కాలేజీలోనే అమ్ముతూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యా పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న, ప్రభుత్వం మాత్రమే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వ అనుమతి ఒకచోట తీసుకొని మరోచోట తరగతులు నిర్వహిస్తున్న ఆల్ఫోర్స్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎన్‌వైకే జిల్లా సలహా మండలి సభ్యుడిగా తౌడోజు శ్రావణ్ చారి




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఎన్ వైకే (నెహ్రూ యువ కేంద్రం ) జిల్లా సలహా మండలి సభ్యుడిగా తౌడొజు శ్రావణ్ చారి నియమితులయ్యారు. తనకు ఈ అవకాశం కల్పించిన కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడాల మంత్రిత్వ శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ చైర్మన్ గా ఉండే ఈ జిల్లా సలహా మండలి కమిటీలో తనకు బాధ్యత రావడం సంతోషంగా ఉందన్నారు. విద్య, సంస్కృతి పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమంలో యువతను భాగస్వామ్యం చేయటం ఈ కమిటీ ముఖ్య ఉద్దేశమన్నారు. పట్టణ గ్రామంలో ఉన్న క్రీడా కారులను ప్రోత్సహిస్తూ యువజన సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. నాకు ఈ బాధ్యత కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



# స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తి ..

## ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బన్నీ వాసు భావోద్వేగం





స్నేహితుడికి అవసరం ఉందంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా అల్లు అర్జున్ అండగా ఉంటారని నిర్మాత బన్నీ వాసు అన్నారు. 'ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లు అర్జున్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'నాకు కష్టం వచ్చిందంటే ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ మందుంటారు. వాళ్లలో ఒకరు మా అమ్మ అయితే.. రెండో వ్యక్తి నా స్నేహితుడు అల్లు అర్జున్. 'ఆయ్' సినిమా ప్రచారం సరిగ్గా జరగడంలేదని.. బన్నీని పోస్ట్ పెట్టమని అడగాలని మా టీమ్ వాళ్లు కోరారు. కానీ, నేను ఆయన్ను అడగలేదు. నేను సమాచారం ఇవ్వకుండానే ఆయనే తన ఎక్స్‌లో ఈ చిత్రం గురించి పోస్ట్ చేశారు. 'సినిమాలకు సంబంధించిన విషయాలను సినిమా వరకు మాత్రమే ఆలోచించగల హీరో ఎన్టీఆర్. 'ఆయ్' ట్రైలర్‌ను పిఠాపురంలో చేయాలని నాకు అనిపించినప్పుడు ఎన్టీఆర్‌కు ఈ సమాచారాన్ని అందించాం. నిర్మాతకు ఉపయోగ పడుతుందంటే మిగతా విషయాలేవీ పట్టించుకోవద్దు అని చెప్పారు. ఈ విషయంలో ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలి. నేను మొదటి నుంచి పవన్ కల్యాణ్ అభిమానిని. ఈరోజు ఆయనతో పాటు పొలిటికల్ జర్నీలో ఉంటున్నానంటే నా అదృష్టమని చెప్పాలి' అంటూ బన్నీ వాసు భావోద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ బావ మరిది నార్నే నితిన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఆయ్' ... మేం ఫ్రెండ్సండి అనేది ఉపశీర్షిక. నయన్ సారిక హీరోయిన్. అంజి కె.మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# ఎన్టీఆర్‌కు గాయాలంటూ.. ప్రచారం


## క్షేమంగానే ఉన్నారంటూ స్పష్టీకరణ

ప్రముఖ హీరో ఎన్టీఆర్ కు తీవ్ర గాయాలయ్యాలంటూ బుధవారం ఉదయం వార్తలొచ్చాయి. దీనిపై నటుడి టీమ్ స్పందించి ఆ వార్తలను ఖండించింది. ఆయన సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. 'జిమ్ చేస్తుండగా ఎన్టీఆర్ ఎడమ చేతికి రెండు రోజుల క్రితం స్వల్ప గాయమైంది. అయినప్పటికీ ఆయన 'దేవర' షూటింగ్‌లో మంగళవారం పాల్గొన్నారు. ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఆయకు పెద్ద ప్రమాదం జరిగినట్టు వస్తున్న వార్తలు అవాస్తవం. దయచేసి ఆ ప్రచారాన్ని నమ్మకండి' అని విజ్ఞప్తి చేసింది. ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. ఈ సినిమా షూటింగ్‌లోనే ప్రమాదం చోటుచేసుకుందని, నటుడికి గాయాలయ్యాయని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారని, ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారంటూ ప్రచారం జరగ్గా టీమ్ రియాక్ట్ అయింది.

# డబుల్ ఇస్మార్ట్ కోసం రామ్ ఫీట్లు







థియేటర్లలో మాస్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేయాలంటే హీరో ఏదో ఒక రిస్కీ ఫీట్ చేయాల్సిందే. మూవీ లవర్స్ కోసం అలాంటి రిస్క్ చేసే యాక్టర్లలో ఒకడు రామ్ పోతినేని. పూరీజగన్నాథ్ దర్శకత్వంలో రామ్ నటించిన చిత్రం డబుల్ ఇస్మార్ట్ (ఆనీబీశ్ర్ీ÷ తాపజీసబి). బ్లాక్ బస్టర్ హిట్ ఇస్మార్ట్ శంకర్ సీక్వెల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా

తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా పూరీ టీం ఏదో ఒక అప్‌డేట్‌తో అభిమానులు, సినీ జనాల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. కాగా ఈ సినిమా కోసం బాలీ (ఇండోనేషియా)కి వెళ్లి తక్కువ టైంలో తప్పనిసరి పరిస్థితుల్లో 18 కిలోలు బరువు తగ్గానని చెప్పాడు రామ్. కాగా ఈ మూవీలో గన్స్, రౌడీలతో స్టైలిష్ యాక్షన్ పార్టు ఉండబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెప్పకనే చెబుతున్నాయి. దీని కోసం రామ్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. డబుల్ ఇస్మార్ట్ బీటీఎస్ స్టిల్స్ చూస్తే ఈ విషయం మీకే అర్థమవుతుంది. ఈ మూవీని నైజాంలో ప్రైమ్ షో ఫిలిమ్స్ విడుదల చేస్తుండగా.. తమిళనాడులో పాపులర్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ కంపెనీ శక్తి ఫిలిం ఫ్యాక్టరీ విడుదల చేస్తోంది. ఇప్పటికే ధిమాక్కిరికిరి డబుల్ ఇస్మార్ట్ టీజర్, ట్రైలర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో హక్కులను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ సొంతం చేసుకుంది.



# ప్రభాస్ సినిమాలో నేను లేను

## అభిమానులకు షాకిచ్చిన మృణాల్ ఠాకూర్



వరుస విజయాలతో జోష్ మీదున్నారు ప్రభాస్. ఆయన హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన 'సీతారామం' బ్యూటీ మృణాల్ నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వీటిపై ఆమె స్పందించారు. ప్రభాస్‌తో మృణాల్ ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో ఓ నెటిజన్ పోస్ట్ చేశారు. 'ఇది హను రాఘవపూడి చిత్రం ఫస్ట్‌లుక్' అని ఆ ఫొటోకు క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై మృణాల్ స్పందించారు. 'మీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నందుకు క్షమించండి. నేను ఈ ప్రాజెక్ట్‌లో లేను' అని కామెంట్ చేశారు. దీంతో రూమర్‌కు చెక్ పడింది. మరి ఇందులో ప్రభాస్ సరసన ఎవరు కనిపిస్తారో అనే చర్చ మరోసారి మొదలైంది. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా ఓ పీరియాడికల్ డ్రామాగా ఈ చిత్రం రానుంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఇది తెరకెక్కనుంది. తాజాగా దీనికి సంబంధించిన టైటిల్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 17న రానున్నట్లు తెలుస్తోంది.

# అందుబాటులోకి మానవ రహిత సబ్ స్టేషన్లు

**ప్రారంభించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**మెరుగైన సేవలే లక్ష్యంగా అడుగులు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పూర్తి స్థాయి సాంకేతికతను ఉపయోగిస్తూ ఏర్పాటు చేసిన హనుమకొండలోని నక్కలగుట్ట సబ్ స్టేషన్, వరంగల్ లోని ఏజే మిల్స్ సబ్ స్టేషన్ లను ప్రారంభించినట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ రెండు సబ్ స్టేషన్లు బుధవారం నుంచి మానవరహిత సేవలు అందిస్తాయన్నారు. సెప్టెంబర్ 30 వరకు హనుమకొండ, వరంగల్ లో దాదాపు 20 సబ్ స్టేషన్ లను మానవ రహిత సబ్ స్టేషన్ లుగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. పూర్తి టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నామన్నారు. సబ్ స్టేషన్ కి సంబంధించిన ప్రతి సమాచారం కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న స్కాడా (సూపర్వైసరీ కంట్రోల్, డాటా ఎక్విసిజన్) సెంటర్ కు అందుతుందని, అక్కడ ఉండే టెక్నికల్ టీం దీనిని పర్యవేక్షిస్తుంటారన్నారు. ఎటువంటి ట్రిప్పింగ్ జరిగినా వెంటనే అలారం సమాచారం అందుతుందని, వెంటనే టీం సభ్యులు అప్రమత్తమై ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకొని ఆన్ చేస్తారన్నారు. దీంతో ట్రిప్పింగ్ సమయం చాల తగ్గుతుందన్నారు. వినియోగదారులకు అంతరాయాల సమయం తగ్గించడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ సబ్ స్టేషన్ లతో మానవ తప్పిదాలను చాల వరకు నియంత్రించవచ్చన్నారు. భద్రత కూడా పెరుగుతుందన్నారు. రియల్ టైమ్ మానిటరింగ్ తో ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారం అందుతుందని, ఏమైనా లోపాలు ఉన్నా సరిదిద్దుకొనే సౌలభ్యం ఇందులో ఉంటుందని పేర్కొన్నారు. ఒక వేళా బ్రేక్ డౌన్ అయినా వెంటనే సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ కు సమాచారం స్కాడా సెంటర్ నుంచి అందుతుందని వెంటనే తన తోటి సిబ్బందితో వెళ్ళి పున్నరుద్ధరణ పనులు చెపడతారన్నారు. పూర్తిగా సీసీ కెమెరాల ద్వారా కూడా చూసుకొనే వ్యవస్థ ఇందులో ఉందన్నారు. సంబంధిత డివిజన్ అధికారుల పర్యవేక్షణ కూడా ఉంటుందన్నారు. ఇందులో పనిచేసే స్టాఫ్ ను మరింత ప్రభావవంతంగా అన్ని సేవల్లో ఉపయోగించుకుటామని తద్వారా సేవలు మెరుగు పడుతాయని తెలిపారు. రోజు రోజుకి మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మరింత నాణ్యమైన, మెరుగైన సేవలు అందించడానికి, అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని సీఎండీ పేర్కొన్నారు.



# ఘనంగా తిరంగా ర్యాలీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నయీమ్ నగర్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు 500 మీటర్ల తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఇలాంటి ర్యాలీలు నిర్వహించారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మనందరం సగర్వంగా జాతీయ పండుగను జరుపుకుందామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్, వరంగల్ మహానగరం సంయుక్త కార్యదర్శి హరిచరణ్, జోనల్ ఇంచార్జులు శ్రవణ్ కుమార్, శ్రీకాంత్ , మనోజ్, భరత్, రాహుల్, రేవంత్, జీవన్, తిరుపతి, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



# రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ లోని రాజ్ భవన్ లో బుధవారం తెలంగాణ అన్ని జిల్లాల రెడ్ క్రాస్ చైర్మన్లు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులను, రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా, గవర్నర్ ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ తెలంగాణ అధ్యక్షుడు జిష్ణు దేవ్ వర్మ కు పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి.వర ప్రసాద్, రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు రావుల రవి చందర్ రెడ్డి పాల్గొన్నారు. మహబూబాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ గత సంవత్సరం నిర్వహించిన అన్ని కార్యక్రమాల వివరాలు వివరించి, గవర్నర్ కు కార్యక్రమాల బుక్ లెట్, ముఖ్యమైన ఫొటోలు అందచేయటం జరిగింది. రాష్ట్ర గవర్నర్ అన్ని జిల్లాల్లో నిర్వహించిన సేవా కార్యక్రమాలను ముఖ్యంగా రక్త దాన కార్యక్రమాలను, కోవిడ్ లో అందించిన సేవలను ప్రత్యేకంగా అభినందించారు. రాజ్ భవన్ నుంచి రెడ్ క్రాస్ కు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర గవర్నర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్ మిశ్రా రాష్ట్ర చైర్మన్, పి.విజయ చందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, అన్ని జిల్లాల చైర్మన్లు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు పాల్గొని తమ జిల్లాల కార్యక్రమ వివరాలు వివరించారు.




# బంగ్లాదేశ్‌లో అరాచకాలు

**ఐక్యరాజ్యసమితి, మానవ హక్కుల సంఘం స్పందించాలి**

**బీజేపీ నేతల డిమాండ్**

**హిందూ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలు, మారణకాండను నిరసిస్తూ హిందూ సంరక్షణ సమితి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మానవత్వపు ఛాయలు ఏమాత్రం లేని ఛాందసవాద ముస్లింలు హిందువుల ఆస్తులు, మందిరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఉగ్రదాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాక్షస మూక దాడితో వేలాది మంది హిందూ స్త్రీలు అత్యాచారాలకు గురయ్యారని, పలువురు క్షతగాత్రులు మారి జీవచ్ఛవంగా మిగిలారన్నారు. ఎటు చూసినా వందలాదిమంది హిందువుల మృతదేహాల కుప్పలు దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా రక్తం ఓడుతున్న బాధిత హిందూ స్త్రీ, పురుషుల ఆర్తనాధాలే వినిపిస్తున్నాయన్నారు. మంటల్లో ఖాళీ బూడిదైనా కష్టార్జితాన్ని చూసి, రక్షించండి అంటూ చేస్తున్న రోదనలు మిన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆందోళనలు :**

**– గంట రవికుమార్**



బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న మారణకాండకు ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బంగ్లాదేశ్ లో జరుగుతున్న అరాచకాలను ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు ఖండించడంతోపాటు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హిందువులంతా సంఘటితమై వారి గ్రామాల్లో, బస్తీల్లో నిరసన కార్యక్రమాలు చేయడం ద్వారా బంగ్లాదేశ్ లో నివసిస్తున్న హిందువులకు మనము మద్దతుగా మనం నిలిచిన వారమవుతామన్నారు. అలాగే రక్షాబంధన్ ఉత్సవంలో మనము మన సోదరిమణులతోని రాఖీ కట్టించుకునేటప్పుడు మనము వారి మానప్రాణాలకు బాధ్యత వహిస్తామని ప్రతిజ్ఞ చేసి మరీ రాఖీ కట్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం సతీష్ షా, బాకం హరి శంకర్, కాసు శిల్ప, బండి సుజాత, కొంతం సంగీత్, చిలువేరు రాజేందర్, శ్రీరంగం సాగర్, కందిమల్ల మహేష్, తాబేటి వెంకట్ గౌడ్, ఎర్రగొల్ల శ్రీనివాస్, కందగట్ల మల్లికార్జున్, గుండా ప్రభాకర్ గుప్తా, ఆడెపు దేవేందర్, హిందూ బంధువులు, తదితర ముఖ్య బీజేపీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎంపీ కావ్య



హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను బుధవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు ఎంపీ కడియం కావ్య పూల మొక్కను అందజేశారు. హనుమకొండ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులతో పాటు జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ తో ఎంపీ చర్చించారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com